క్లుప్తంగా

200 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న చందన నాగేశ్వర్ తదితరులు

కడియం: గ్రామంలో మంగళవారం జరిగిన వైద్య శిబిరంలో సుమారు 200 మందికి సేవలు అందించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు శాకా సురేష్ తన పుట్టిన రోజు సందర్భంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వివిధ రకాల వైద్య పరీక్షలను చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రాజమహేంద్రవరంలోని డెల్టా ఆస్పత్రి వైద్యులు ఈ శిబిరంలో సేవలందించారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ పాల్గొన్నారు. ఏటా వైద్య శిబిరం నిర్వహిస్తున్న సురేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

క్రిస్మస్ సందర్భంగా రగ్గులు పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: క్రిస్మస్ సందర్భంగా ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరి గట్టు, రైల్వే స్టేషన్‌తో పాటు, వివిధ ప్రాంతాల్లోని నిరాశ్రయులు, వృద్ధులు, దివ్యాంగులకు రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు. ప్రేమ, దయ, కరుణ, శాంతి క్రిస్మస్ సందేశమని, పొరుగువారిని ప్రేమించమనే క్రీస్తు సందేశంతోనే సేవా కార్యక్రమాలు చేస్తున్నామని సంస్థ అధ్యక్షుడు అద్దంకి రాజయోనా తెలిపారు.

క్రీస్తు బోధనలు స్ఫూర్తిదాయకం

కడియం: సర్వ మానవాళికి క్రీస్తు బోధనలు స్ఫూర్తిదాయకమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని బుర్రిలంకలో కాంగ్రెస్ పార్టీ రూరల్ కోఆర్డినేటర్ తాడాల కొండ్రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్లు క్రీస్తు భక్తిగీతాలు ఆలపించారు. ఆధ్యాత్మిక సందేశాలందించారు. కార్యక్రమంలో ప్రముఖులు జేటీ రామారావు, శారద, చైతన్యన రెడ్డి, డాక్టర్ వడయార్, శ్రీను, హుస్సేన్, వేంకటేశ్వరరావు, మార్టిన్ లూథర్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

29న వారాహిదేవికి విశిష్ట మహాభిషేకం

సీటీఆర్ఐ: మార్గశిర మాస శివరాత్రి సందర్భంగా గాడాలలోని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వర స్వామివారి పీఠంలో ఉన్న వారాహి దేవికి, చక్ర వాహిని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి విశిష్టాభిషేకం శ్రీకారం చుట్టినట్టు పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు స్వామిజీ అన్నారు. మంగళవారం స్థానిక దానవాయిపేటలోని ట్రస్టు కార్యాలయంలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్వామిజీ మాట్లాడుతూ, ఈ నెల 29న ఉదయం 6.30 నుంచి 1,08,012 రుద్రాక్షలతో, 1008 కరుంగలీమలతో, 108 సాలగ్రామాలతో, గంగ, గోదావరి, కృష్ణ, విష్ణుపాదం, భీమ, అమరజా పవిత్ర నదీ జలాలతో విశిష్టాభిషేకాన్ని నిర్వహించనున్నట్టు వివరించారు. భక్తులు ఇందులో పాల్గొని, ఈ మహా జలాలను తలపై చల్లుకుంటే అపమృత్యుగండం తొలగి, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని, రుణ బాధలు తీరుతాయని చెప్పారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12 నుంచి 1:30 వరకు వారాహిదేవి దర్శనం ఉంటుందని సంస్థ ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతాల రమేష్ తెలిపారు. సాయంత్రం 5:30 నుంచి అర్చన, నిత్యం వారాహి హోమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మన గుడి–మన సేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి జాతీయ చైర్‌పర్సన్ ధరణికోట దుర్గవేంకట హేమవతి, కె.హిమబిందు, సీతయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్టు ముగిసినందునే..

సాక్షి ఇంపాక్ట్

కడియం: ముఖ్యమంత్రి కంటి వెలుగు కార్యక్రమం కాంట్రాక్టు కాలపరిమితి పూర్తయినందున మాత్రమే ప్రస్తుతం సేవలు నిలిపివేసినట్టు జిల్లా ఆస్పత్రుల కో–ఆర్డినేటర్ డా.ఎస్‌పీ పద్మశ్రీరాణి ఒక ప్రకటనలో తెలిపారు. 'ఐయ్యో పాపం' శీర్షికన మంగళవారం కంటి వైద్యం కోసం మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో స్పందించిన పద్మశ్రీరాణి ఆరున్నరేళ్ల పాటు ఈ కార్యక్రమం కొనసాగిందన్నారు. కడియం సీహెచ్‌సీకి సంబంధించి కాంట్రాక్టు రెన్యువల్ ఇంకా కానందున కంటి వైద్య పరీక్షలు నిలిపివేశారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించామని వివరించారు.

రెండిళ్లలో వెండి వస్తువుల చోరీ

కంబాలచెరువు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు చోట్ల కేజీ వెండి వస్తువులు చోరీకి గురైనట్టు మంగళవారం కేసులు నమోదయ్యాయి. సీతంపేటకు చెందిన దుర్గాదేవి ఈ నెల 10న ఇంటికి తాళం వేసి, పైఅంతస్తులో అత్త వద్ద నిద్రించేందుకు వెళ్లింది. మర్నాడు ఉదయం చూసేసరికి బీరువాలో 250 గ్రాముల వెండి వస్తువులు మాయం అయ్యాయి. అదేవిధంగా రంగ్రీజుపేటకు చెందిన గణేష్‌కుమార్ ఈ నెల 7న కుటుంబ సమేతంగా హైదరాబాద్ వెళ్లాడు. ఈ నెల 23న తిరిగిరాగా, బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో 750 గ్రాముల వెండి వస్తువులు చోరీ అయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



విద్యుత్ వెలుగులతో ఆర్‌సీఎం చర్చి ముఖద్వారం



విద్యుత్ కాంతులతో ముస్తాబైన ఆర్‌సీఎం చర్చి



బాలాజీపేట సెంటర్‌లో ప్రత్యేక సెట్టింగ్



ఆర్‌సీఎం చర్చిలో మేరీమాత విగ్రహం వద్ద విద్యుత్ కాంతులు



విద్యుద్దీపాల వెలుగులో ఏపిఫానియా పారిస్ చర్చి

క్రీస్తు నేడు పుట్టెను



ఐఎల్‌టీడీ సెంటర్‌లో క్రీస్తు జననంపై సండే స్కూలు చిన్నారుల వేషధారణలు

- క్రిస్మస్ పండగకు చర్చిల ముస్తాబు
- పలు చోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలు

ఆల్కాట్‌తోట(రాజమహేంద్రవరం రూరల్): కరుణామయుడైన ఏసు క్రీస్తు జన్మదిన వేడుకలకు చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. క్రిస్మస్ వేడుకలకు రాజమహేంద్రవరం నగరంతో పాటు, పరిసర ప్రాంతాల్లోని చర్చిలన్నీ అందంగా తీర్చిదిద్దారు. ఐఎల్‌టీడీ సెంటర్‌లోని గ్లోరియోడై లూథరన్ చర్చి, ఏపీఫానియా పారిస్ చర్చి, ఆర్‌సీఎం చర్చి విద్యుద్దీప కాంతులతో సరికొత్త శోభను సంతరించుకున్నాయి. చర్చి ప్రాంగణాల్లో ఏర్పాటుచేసిన క్రిస్మస్ ట్రీలు, పశువుల పాక సెట్టింగులు ఆకట్టుకున్నాయి. ఏపిఫానియా పారిస్ చర్చిలో సండే స్కూలు విద్యార్థులు ప్రత్యేకంగా వేసిన పశువులపాక సెట్టులో క్రీస్తు జననం ఇతివృత్తం తెలిపేలా వేసిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. అలాగే సండే స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలాజీపేట సెంటర్‌లో క్రిస్మస్ సందర్భంగా వేసిన సెట్టు ఆకట్టుకుంది. ఐఎల్‌టీడీ సెంటర్‌లో యూత్ ఆధ్వర్యంలో వేసిన సెట్టింగు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

క్రిస్మస్ కారల్..

రాజవోలు గ్రామంలోని గ్రేస్ గాస్పెల్ మినిస్ట్రీస్ చర్చి రెవ పి.టాటావిక్టర్, సుగుణ విక్టర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ కారల్ మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ప్రపంచంలో అతిపెద్ద పండగైన క్రిస్మస్‌ను ప్రపంచమంతా సువార్త చాటడమే ఈ క్రిస్మస్ కారల్ ఉద్దేశమని టాటావిక్టర్ తెలిపారు.



రాజవోలులో క్రిస్మస్ కారల్ నిర్వహిస్తున్న టాటావిక్టర్ తదితరులు



ఐఎల్‌టీడీ యూత్ వేసిన క్రిస్మస్ సెట్టింగ్

క్రీస్తు బోధనలు అనుసరణీయం

మంత్రి కందుల దుర్గేష్



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి దుర్గేష్ తదితరులు



క్రిస్మస్ వేడుకల్లో ఎర్నెస్ట్ మోజెస్ తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): దేవాది దేవుడు, కరుణామయుడు, లోక రక్షకుడైన ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, అనురాగాలు సమాజంలోని ప్రజల మనగడకు ఎంతో అవసరమని రాష్ట్ర సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఓ హోటల్‌లో జరిగిన క్రిస్మస్ ఐటి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఏపీ స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ ప్రతాప్‌సిన్హా, రాజమండ్రి పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు డా.కె.సుధీర్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, క్రిస్మస్ సందర్భంగా జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మనుషుల మధ్య అంతరం పెరుగుతున్న నేటి సమాజంలో క్రీస్తు ప్రవచనాలు అత్యంత అవసరమన్నారు. సమాజంలో శాంతి కోసం ప్రబోధించిన మహనీయుడు ఏసుక్రీస్తు అని కొనియాడారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు గొప్ప వ్యక్తి అని, ఆయన ఇచ్చిన సందేశాలను అందరూ ఆచరించాలన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి, క్యాండిల్స్ వెలిగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సునీల్‌కుమార్, క్రైస్తవ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గంలో పయనించాలి

కంబాలచెరువు: ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయమని, ఆయన మార్గంలో పయనిస్తే ప్రపంచం శాంతితో వర్ధిల్లుతుందని రెవరెండ్ పి.ఎర్నెస్ట్ మోజెస్ అన్నారు. స్థానిక వెంకటాపురంలోని బైబిలు మిషన్ సీయోను ప్రార్థన మందిరంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన మాట్లాడుతూ, క్రీస్తు బోధించిన అంశాలను పాటిస్తే అందరినీ ప్రేమ, సమానత్వంతో చూడగలమన్నారు. మందిరం వ్యవస్థాపకురాలు గారపాటి ఎలిజబెత్ ప్రసంగించారు. అనంతరం రెవరెండ్ జి.శాంసన్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో చిన్న పిల్లల నృత్యాలు, నాటికలు అలరించాయి. స్థానిక ఆవరోడ్డులోని రెయిన్‌బో స్కూలులో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన క్రీస్తు జన్మించిన పశువుల తొట్టి, జ్ఞానుల వేషధారణలు, క్రిస్మస్ ట్రీ వంటివి ఆకట్టుకున్నాయి.

దివ్యాంగులకు మౌలిక వసతులు కల్పించాలి

జిల్లా జడ్జి గంధం సునీత



ఆశ్రమంలో చిన్నారులకు దుప్పట్లు, ఇతర సామగ్రి పంపిణీ చేస్తున్న జిల్లా జడ్జి సునీత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): విభిన్న ప్రతిభావంతులకు సమాజంలో వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలో ఉన్న ప్రియదర్శిని పిల్లల ఆశ్రమాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఆశ్రమంలోని విద్యార్థులకు దుప్పట్లు, తల దిండ్లు, చాపలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, దాతల సహకారంతో ప్రియదర్శిని ఆశ్రమంలో అవసరమైన సామగ్రి అందజేశామన్నారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఆధ్వర్యంలో వారికి అవసరమైన కళ్లద్దాలను అందిస్తున్నట్టు తెలిపారు. సర్జరీకి సంబంధించి ఒక కేసును కింగ్ జార్జ్ ఆస్పత్రికి పంపే ఏర్పాటు చేస్తున్నామన్నారు. సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు, రోటరీ ప్రెసిడెంట్ తోట సుబ్బారావు, ఆశ్రమ కరస్పాండెంట్ కె.స్వప్నవర్మ, ప్రిన్సిపాల్ ఏ.ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల చార్జిషీట్‌పై సూచనలు

విచారణ ఖైదీల కేసుల దర్యాప్తులో, చార్జిషీట్ నమోదుపై పోలీసులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పలు సూచనలు చేశారు. జిల్లా కోర్టు ఆవరణలో అండర్ ట్రయిల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు, బెయిల్, జామీను విషయాల్లో ఖైదీల సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలను ఆమె వివరించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు, ఒకటో అదనపు సబ్ కోర్టు న్యాయమూర్తి ఎస్‌కే జానీబాష, జీపీ సీహెచ్‌వీ ప్రసాద్, డీఆర్ఓ డి.సీతారామ్మూర్తి, అడిషనల్ ఎస్పీ ఎంవీయం.మురళీకృష్ణ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను గౌరవించిన పార్టీ బీజేపీ

ఎంపీ పురందేశ్వరి



పిడింగొయ్యి సచివాలయం-2ను ప్రారంభిస్తున్న పురందేశ్వరి, గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అత్యధికంగా గౌరవించినది బీజేపీ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కాంగ్రెస్ మాదిరిగా రాజ్యాంగాన్ని జేబులో పెట్టుకోకుండా దానికి శిరసు వంచి ముందుకు వెళ్తున్నది తమ పార్టీ అని చెప్పారు. మంగళవారం రాజమహేంద్రవరంలో ఆమె నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, అంబేడ్కర్ రాజ్యాంగం కారణంగానే తాను ప్రధాని అయ్యానని స్వయంగా నరేంద్ర మోదీ చెప్పారన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తుందని సార్వత్రిక ఎన్నికల సమయంలో కాంగ్రెస్ దుష్ప్రచారం చేసిందని, ఇది పూర్తి నిరాధారమైనదన్నారు. ఆర్టికల్ 356ని కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందన్నారు. పొత్తులో మూడు పార్టీలు ఉన్నప్పుడు ఎవరి వాటాను బట్టి వారికి పదవుల పంపిణీ ఉంటుందన్నారు. రాజమహేంద్రవరంలో టిడ్కో అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టిలో పెట్టామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, నాయకులు పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ పురందేశ్వరి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి అన్నారు. మంగళవారం పిడింగొయ్యి పంచాయతీలో రూ.43.6 లక్షలతో నిర్మించిన సచివాలయం–2ను, శాటిలైట్‌సిటీలో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లును వారు ప్రారంభించారు. హుకుంపేట డిబ్లాకులో రూ.78 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మాజీ సర్పంచ్‌లు దుద్దుపూడి రామకృష్ణ, బొప్పన నాగేశ్వరరావు, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, డీఈ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు



డీపీటీఓ షర్మిల అశోక

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ నుంచి తూర్పుగోదావరి జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులను ఆర్టీసీ అధికారులు సిద్ధం చేశారు. జనవరి 9 నుంచి 13 వరకు తెలంగాణ నుంచి జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం ఆర్టీసీ డిపోల నుంచి జిల్లాకు ప్రత్యేక సర్వీసులను నిర్వహిస్తున్నారు.

జిల్లాలోని నాలుగు డిపోల నుంచి 88 ప్రత్యేక సర్వీసులు హైదరాబాద్ నుంచి ప్రయాణించనున్నాయి. రాజమహేంద్రవరం డిపో 47, గోకవరం డిపో 16, కొవ్వూరు డిపో 16, నిడదవోలు 9 సర్వీసులను కేటాయించారు. ఆయా సర్వీసుల్లో అధిక రుసుము లేకుండా, సాధారణ టిక్కెట్ ధర వసూలు చేస్తామని డీపీటీఓ షర్మిల అశోక మంగళవారం ఇక్కడ తెలిపారు.

సంక్రాంతి అనంతరం జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు తిరుగు ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులను సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ప్రత్యేక బస్సులతో పాటు, ప్రయాణికుల రద్దీ మేరకు మరిన్ని బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

వినియోగదారులు చైతన్యవంతులు కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రస్తుత సమాజంలో వినియోగదారులు చైతన్యవంతులు కావాలని జేసీ చిన్న రాముడు అన్నారు. మంగళవారం జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథి జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ, వినియోగదారులు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరమన్నారు. విజిలెన్స్ కమిటీ సభ్యుడు ధర్నాలకోట వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీపీని త్వరగా నిర్మించాలి

ఆల్కాట్‌తోట(రాజమహేంద్రవరం రూరల్): నేషనల్ రివర్ కన్జర్వేషన్ ప్రాజెక్టులో భాగంగా రూ.95.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 50.6 ఎంఎల్‌డీ ఎస్‌టీపీని వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నిర్మాణంలో ఉన్న ఎస్‌టీపీని పరిశీలించారు. భవిష్యత్తు అవసరాల మేరకు అదనంగా ఈ ఎస్‌టీపీ నిర్మిస్తున్నట్టు చెప్పారు. పరిసర గ్రామాలు విలీనమైనా ఎస్‌టీపీ ఉపయోగపడుతుందన్నారు. ఎస్ఈ జి.పాండురంగారావు, ఈఈ షేక్ మదర్షా ఆలీ, డీఈఈ విరూపాక్షరావు ఉన్నారు.

సమగ్రంగా సహిత విద్య

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): క్షేత్రస్థాయిలో సహిత విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి మరింత కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి పేర్కొన్నారు. జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారుల అవగాహన కార్యక్రమం స్థానిక హోటల్‌లో మంగళవారం జరిగింది. దీనికి సుభాషిణి అధ్యక్షత వహించారు. ప్రభుత్వం సహిత విద్యాభివృద్ధికి అందిస్తున్న పథకాలు అర్హత గల పిల్లలందరికీ అందించాలని అన్నారు. రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ వై.నరసింహ మాట్లాడుతూ సహిత విద్య బలోపేతానికి మండల విద్యాశాఖ అధికారుల కృషి చేయాలన్నారు. స్పెషల్ ఎడ్యుకేటర్ గౌతమ్ మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ ఎలా మంజూరు చేస్తారు. దానికి అర్హతలు ఏమిటి అనే అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమగ్ర శిక్షా జిల్లా కోఆర్డినేటర్ ఎస్.కనకబాబు, డాక్టర్ క్రాంతి, సౌజన్య, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

మధుర గాయకుడు రఫీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అద్భుత గానంతో మైమరపించిన మధుర గాయకుడు మహమ్మద్ రఫీ అని పలువురు వక్తలు నివాళులర్పించారు. జిత్ మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా, మిత్ర బృందం సంయుక్త ఆధ్వర్యంలో రఫీ శత జయంతి ముగింపు ఉత్సవం స్థానిక జిత్ మోహన్ మిత్ర కళా వేదికలో మంగళవారం జరిగింది. నట గాయకుడు జిత్‌మోహన్ మిత్ర అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎండీ ఖాదర్‌ఖాన్ పాల్గొన్నారు. సాహితీవేత్తలు పీవీఎస్ కృష్ణారావు, వి.జగపతి, బి సీతా రామారావు తదితరులు పాల్గొన్నారు. రఫీ పాటల సంగీత విభావరి సందడిగా సాగింది.

త్వరితగతిన రుడా పనులు పూర్తి

రాజమహేంద్రవరం సిటీ: రుడా పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సంస్థ చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. మంగళవారం రుడా కార్యాలయంలో అధికారులతో తొలి సమీక్షా సమావేశం నిర్వహించారు. రుడా నిధులతో జరుగుతున్న ఇంజినీరింగ్ పనులు, మాస్టర్ ప్లాన్ తదితర అంశాలపై చర్చించారు. త్వరలో నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులతో సమీక్షలు నిర్వహిస్తామన్నారు.వైస్ చైర్మన్ కేతన్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి 11 వరకు షాపుల నిర్వహణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాబోయే పండగలను దృష్టిలో ఉంచుకుని షాపులను రాత్రి 11 వరకు నిర్వహించేందుకు ఎస్పీ నరసింహకిషోర్ అంగీకరించినట్టు చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం ఎస్పీని వారు కలిశారు. క్రిస్మస్, సంక్రాంతి తదితర పండగల సందర్భంగా వినియోగదారుల సౌలభ్యం కోసం షాపులను రాత్రి 11 వరకు నిర్వహించేలా అవకాశం ఇవ్వాలని ఎస్పీని కోరగా, ఆయన అంగీకరించారు. ప్రతి షాపు వద్ద నిఘా కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. చాంబర్ ప్రతినిధులు తవ్వా సూర్యనారాయణమూర్తి, ఆకుల శ్రీనివాస్, వంటెద్దు సూరిబాబులున్నారు.

మేజర్‌లో డేంజర్

- పూర్తిగా పడకేసిన పారిశుధ్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- మినీ డంపింగ్ యార్డుగా మారిన గ్రామం
- కనీసం కుండీలు ఏర్పాటు చేయలేని దుస్థితిలో ధవళేశ్వరం పంచాయతీ



ధవళేశ్వరం ఇత్తడి ఫ్యాక్టరీ వద్ద పేరుకుపోయిన చెత్త

ధవళేశ్వరం: పేరుకు రాష్ట్రంలోనే పెద్ద మేజర్ పంచాయతీ. సుమారు 60 వేల జనాభా కలిగిన గ్రామం. సాక్షాత్తూ కలెక్టర్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న పంచాయతీ అయినప్పటికీ, పారిశుధ్య నిర్వహణను కనీసం పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. పంచాయతీ అధికారులు కనీసం పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో, ధవళేశ్వరంలోని అనేక ప్రాంతాలు మినీ డంపింగ్ యార్డుగా మారుతున్నాయి. అయినప్పటికీ అధికారులు కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. వరాహాలు సైతం గ్రామంలో వీర విహారం చేస్తున్నాయి. దీంతో గ్రామస్తులు తరచూ అనారోగ్యాలకు గురవుతున్నారు.

మినీ కంపోస్ట్ యార్డుగా..

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో గ్రామంలో అనేక ప్రాంతాలు మినీ కంపోస్ట్ యార్డుగా మారాయి. గ్రామంలో పలుచోట్ల సేకరించిన చెత్తను రిక్షాల్లో తెచ్చి వేరే ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. అంతేగాక రోజుల తరబడి అలాగే ఉంచడంతో, ఆయా ప్రాంతాలు కంపోస్ట్ యార్డులను తలపిస్తున్నాయి. స్థానిక కాటన్‌పేట ఇత్తడి ఫ్యాక్టరీ వద్ద ఇతర ప్రాంతాల్లో సేకరించిన చెత్తను రోడ్డు పక్కన వేస్తుండటంతో ఈ ప్రాంతంలో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఎర్రకొండలో అనేక ప్రాంతాలు చెత్తతో నిండి, కంపోస్ట్ యార్డును తలపిస్తున్నాయి. కాటన్‌పేట, గొల్లపేట, ఎర్రకొండ, జాలరుపేట, కొత్తపేట, ఇండస్ట్రియల్ కాలనీ తదితర ప్రాంతాల్లో తీవ్ర అపరిశుభ్రత నెలకొంది.

పందుల స్వైర విహారం

గ్రామంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో గుంపులుగా సంచరిస్తుండటంతో తీవ్ర అపరిశుభ్రత నెలకొంటోంది. పందుల స్వైర విహారంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. పందుల బెడదతో అనారోగ్యాలకు గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుండీలూ పెట్టలేక..

రాష్ట్రంలోనే ప్రముఖ మేజర్ పంచాయతీ అయిన ధవళేశ్వరంలో కనీసం పాడైన చెత్త కుండీల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేని దుస్థితిలో పంచాయతీ అధికారులు ఉన్నారు. ధవళేశ్వరంలో ఉడుతావారి వీధిలో పాత చెత్త కుండీ పగిలిపోయింది. ఇక్కడ చెత్త కుండీని ఏర్పాటు చేయలేదు. పంచాయతీలో కుండీలు లేకపోవడంతో ఏర్పాటు చేయలేదని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. దీంతో ఇక్కడ రోడ్డుపైనే చెత్త వేస్తుండటంతో పారిశుధ్య సమస్య నెలకొంది.

అరకొర జీతాలతో..

గ్రామస్తుల నుంచి పన్నులను ముక్కు పిండి వసూలు చేస్తున్న పంచాయతీ అధికారులు పారిశుధ్య సిబ్బందికి జీతాలు ఇచ్చేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో పారిశుధ్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీవ్ర ఒత్తిళ్లు రావడంతో ఇటీవలే రెండు నెలల జీతాలిచ్చి అధికారులు చేతులు దులుపుకొన్నారు. పండగ సమీపిస్తున్న వేళ తమకు బకాయిలు కూడా ఇవ్వకపోగా, మరో రెండు నెలల జీతాన్ని బాకీ పెట్టడంపై పారిశుధ్య సిబ్బంది తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇచ్చిన సగం జీతం అప్పులకే సరిపోయిందని, పండగ పూట కుటుంబాలతో పస్తులు ఉండాల్సిందేనని నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి, తమకు రావాల్సిన రెండు నెలల జీతం, బకాయిలను వెంటనే ఇవ్వాలని కోరుతున్నారు.